**కథ**

# పాపాయి నవ్వాలి

**నియాజ్ అలి**

**వకుళకు ఉద్వేగంగా వుంది.. ఆమె మనసుకు కొత్తగా రెక్కలొచ్చినట్టు, తాను దూదిపింజెలా ఆకాశంలో తేలిపోతున్నట్టుగాను వుంది.**

**నిజానికి ఓ నెలకో మరింకాస్త ముందుగానో ఈ లోకంలోకి రాబోతున్న ఓ చిన్నప్రాణి బరువును మోస్తున్న శరీరం- పాదాలూ ఆమె మనసుకు సహకరించక బరువుగా పడ్తున్నాయి. అయినా ఆమె వుద్విగ్నంగా ఇంట్లోంచి బయటకీ బయట్నుంచి వంటింట్లోకీ తిరుగుతూ భర్త సారథి రాకకోసం ఎదురుచూస్తోంది.**

'పొద్దుట్నించీ ఈ మనిషెక్కడికెళ్ళినట్టూ..?' అనుకుంటూంటే ఆమె పెదాల మీద సన్నగా నవ్వు విరిసింది. పాతికేళ్ళు దాటిన భర్తను ఇర్వై మాత్రం దాటిన ఓ భార్య ఇలా పెద్దరికంగా సంబోధించడం.. మరోసారి ముసి ముసిగా నవ్వుకుందామె-

వీధి చివరిదాకా ఓ చూపు చూసేసి తిరిగి చారు తాలింపు వేయడానికని వంటింట్లోకొచ్చింది. త్వరగా వంట చేసి హాస్పిటల్లో వున్న అత్తగారి కోసం కారియర్ పట్టుకెళ్ళాలి.

అత్తగారు గుర్తుకొస్తూనే- ఆమెకు తననింత ఉద్విగ్నతకూ, ఉత్సాహానికీ గురిచేస్తున్న 'పాపాయి' గురించి శుభవార్త ఎప్పుడెప్పుడు భర్తకు చెప్పేద్దామా అని తహతహగా వుంది. ఆ శుభవార్త గనక సారథి వింటే అతని ప్రతిస్పందన ఎలా వుంటుందో పరిపరివిధాల వూహించుకుంటూ లోలోనే సంబరపడిపోతోంది వకుళ!

అవునూ... ఓ చిన్నారి పాపాయి ఈ యింట్లోకి రాబోతోందంటే ఇంత ఆనందంగా వుందేవిటసలు? నిజంగా తనలోనూ అత్తగారికిలా పాప కోసం అంత గాఢంగా వుందా కోరిక?- అత్తగారంతగా తానూ ఓ పాపకోసం అర్రులు చాస్తోందా?... ఓ చిన్నారి చిట్టిపాప నట్టింట్లో బుడి బుడి అడుగులేస్తూంటే, బొట్టూ కాటుక దిద్ది పూలు పెట్టి రకరకాల గౌన్లు తొడిగి కాళ్ళకు మువ్వల పట్టీలూ చిట్టి చిట్టి చేతులకు గాజులు తొడిగి పువ్వులా విరిసే ఆ బోసినవ్వుల అందాలు చూసి పరవశించాలని తనకూ అంత ఆశ వుందా?

ఇది అత్తగారి సాంగత్యం వల్లనే కావచ్చునేమో-

వకుళ తనలోకి తానే తరచి తరచి చూసుకుంటూంటే-పెళ్ళయినప్పట్నుంచీ నాలుగేళ్ళ గతం తలుపునకు రాసాగిందామెకు-

★ ★ ★

పెళ్ళిచూపులకొచ్చి ముద్దబంతి పూలచెండు లాంటి బారెడు జడను అపురూపంగా చూస్తూ తన పచ్చటి నున్నటి చెక్కిళ్ళను తాకి మరీ చూసి, 'లక్ష్మీదేవిలా వున్నావం'టూ తన బుగ్గల్ని పుణికి సుతారంగా పాపిట్లో చుంబిస్తున్న కాబోయే అత్తగార్ని వింతగా బెదురుగా చూడడం వకుళకు ఇంకా గుర్తే..

పెళ్ళయింది మొదలు తలంటడం, చిక్కుతీసి జడవేయుటం, సాయంకాలం సన్నజాజులు కోసి తానే మాలకట్టి జడ నిండుగా తురమడం, చివరికి బొట్టూకాటుకా కూడా తానే దిద్దడం- అన్నీ తానే చేసే అత్తగార్ని వింతగా చూడడం గమ్మత్తయిన అనుభవం- అస్తమానం పెత్తనం చలాయిస్తూ కోడల్ని అదిలించాల్సిన ఆమె...కన్నతల్లి కంటే కూడా అపురూపంగా చూసుకోడం నిజంగా తన అదృష్టమే అనుకుంది వకుళ.

వేసవిలో మల్లెపూల జడ తీరి కూర్చుని ఓపిగ్గా కుడుతుంది. ఆమె ఇష్టాన్ని కాదనలేక...తన జడ బరువుకు తోడు పూలజడ భారాన్ని మర్నాటి దాకా మోస్తుంది వకుళ-''మొగలి పువ్వు జడైతే ఇంకా అందంగా నాజూగ్గా సువాసనగా తేలిగ్గా వుండును'' అని మల్లెపూల జడని మురిపెంగా చూసుకోడం- ఓ వింత అనుభూతే.

అలాంటి సునంద- కోడలు.. మొదటిసారిగా తల్లి కాబోతోందని డాక్టరు అనగానే ''నాకు మనవరాలే కావాలి'' అని ఆత్రంగా అనడం, చిన్నపిల్ల ఆటబొమ్మ కోసం అడిగినంత అమాయకత కన్పించిందామె కళ్ళల్లో- డాక్టరు నిర్మల కూడా నవ్విందామె చేష్టకి.

అయితే వకుళకు శరత్ పుట్టాడు...సునంద ముఖంలో నిరాశ కొట్టొచ్చినట్టు కన్పించింది. అది కాస్సేపే..చిన్నారి మనవడ్ని చూసి వాడి ఆలనాపాలనా చూస్తూ దాదాపు చంటిపిల్లే అయింది సునంద. మవడితోబాటు ఆడుతూ పాడుతూ తలనీలాలు తియ్యలేదు..వాడికి పోనీటెయిల్ కట్టేది. జడలేసి పూలు పెట్టేది. బొట్టూకాటుక దిద్ది, కొడుకు ఇంట్లో లేనప్పుడు గౌన్లు వేసి 'పాప'నీ వాడిలోనే చూసుకుని మురిసిపోయేది..అత్తగారు పాపకోసం ఎంతగా తపిస్తోందో అర్థమై ఆమె కళ్ళు చెమరించేవి.

అందుకే రెండోసారి 'తల్లి కాబోతున్నారు' అనే డాక్టరు మాటల్ని చాలా ఆనందంగా స్వీకరించింది వకుళ. పాపకోసం సునంద కళ్ళల్లో మళ్ళీ ఆశ!

అయితే ఆమె ఆశ తీరదని తెలిసినప్పుడు అత్తగారి మాటెలా వున్నా వకుళ చాలా కుంగిపోయింది. తను కేవలం అత్తగార్ని నిరాశ పరచడమే కాదు... తనకూ లోపల ఏదో దిగులు తననంతగా ఆదరించే అత్తగారి కోరికని తీర్చలేకపోతున్నాననే అపరాధ భావం లాంటిది కలిగింది. ఆమె లాలింపులకు బాబునొదిలేసి అత్తగారి చూపుల్ని వీలయినంతగా తప్పించుకు తిరగసాగింది వకుళ. స్కానింగ్ చేసి 'మళ్ళీ అబ్బాయే పుడతాడు' అన్న డాక్టరు మాటలు సారధిని కూడా చాలా నిరాశకు గురిచేశాయి. 'ఇద్దరు పిల్లలతో చాలించాలి' అనే ఆశయంతో పట్టుదలగా వున్నాడతను.

అందుకే భార్యను హాస్పిటల్లోనే హెచ్చరించాడు.

''అమ్మకు తెలియనివ్వకు-మళ్ళీ బాబేనంటే నొచ్చుకుంటుంది. మెల్లగా నచ్చజెప్పి ఆపరేషను చేయించుకుందువుగాని'' అని.

అయితే నెల గడవకుండానే ఎలా తెలిసిందో విషయం తెలిసిపోయింది సునందకు- ఆపరేషను వద్దంటే వద్దని పోరడం మొదలెట్టింది.

''మరోసారి చూడండి..నట్టింట్లో ఆడపిల్ల గాజుల గలగలా, కాలి మువ్వల సవ్వడీ నీకు వినాలని లేదా? పిల్లలు లేని వాళ్ళు లేరని ఏడుస్తూంటే ఇద్దర్ని కని భారమనుకుంటే ఎలారా?'' అంటూ కొడుకునే డైరెక్ట్‌గా సాధించసాగిందామె.

క్రమంగా ఇంట్లో ఒకలాంటి స్థబ్దత ఆవరించసాగింది. శరత్ తప్పటడుగులూ, బుడిబుడి నడ

కలూ నత్తిమాటలూ మధ్యమధ్య కాస్తంత ఆటవిడుపులా ఆనందం కలిగిస్తున్నాయి.

సునంద స్థబ్దుగా మారిపోయింది.. తిండి మీద, నిద్రమీద కోడలి మీదా శ్రద్ధ తగ్గింది. ఎటొచ్చీ మనవడి లాలనే కాస్త వూరటగా వుందామెకు.

ఉన్నట్టుండి సునందకు ఒంట్లో నలత చేసింది.


''కడుపులో ఎలాగో వుంటోంది. ఏదో కదుల్తున్నట్టుగా వుంది''

అని మాటిమాటికీ స్వగతంగా అనుకుంటున్నట్టు పైకే అనసాగింది. భర్త సుందరం కంగారుపడి లేడీ డాక్టరుకు చూపించాడు. ఆపైన టెస్ట్‌లూ స్కానింగ్ వగైరాలు చకచకా జరిగాయి.

విషయం తెలిసి ఆయనకి తల తిరిగిపోయింది.. అదేదో కలలా వింతగా అన్పించసాగింది. హాస్పిటల్లో భార్యాభర్తలిద్దరూ తర్జన భర్జనలు పడ్డారు. గుట్టుచప్పుడు కాకుండా ఒక గట్టి నిర్ణయం జరిగిపోయింది. విషయం కొడుక్కీ కోడలికీ తెలియకూడదనుకున్నారు. డాక్టరు విషయం బయట పెట్టరాదని మాట తీసుకున్నారు.

★ ★ ★

''అమ్మా..వకుళా..సారథి వచ్చాడు చూడమ్మా'' బయట్నుంచీ మామగారి పిలుపు



నకు వకుళ హడావిడిగా బయటికొచ్చింది.

ఆటోవాలాతోబాటు మామగారి సాయంతో జాగ్రత్తగా నెమ్మదిగా ఆటోలోంచి దిగుతున్న భర్తను చూసి భయంతో బిగుసుకుపోయి గుమ్మంలోనే ఆగిపోయింది వకుళ! శుభ్రంగా ప్యాంటూ షర్టుతో వెళ్ళిన సారథి కొత్తలుంగీతో అతి నెమ్మదిగా నడుస్తున్నాడు...

ఏం జరిగింది?

''ఆపరేషను చేయించుకొచ్చినట్టున్నాడమ్మా..పక్క సరిచెయ్యి తల్లీ..పడుకుంటాడు'' మామగారి మాటలకు ఈ లోకంలోకొచ్చింది వకుళ.

పళ్ళ బిగువున బాధను భరిస్తూ తండ్రి సహాయంతో మంచం మీద పడుకున్నాడు సారథి. వేడిగా కాఫీ కలిపి తాగించిందామె.

సుందరం తాను హాస్పిటలుకు క్యారేజ్ పట్టుకెళతాననీ బాబునీ సారథినీ చూసుకోమన్చెప్పి ఆ ఏర్పాట్లు చూడమంటే వకుళ అత్తగారికీ మావగారికీ క్యారేజ్, వాటర్ బాటిలూ, ఫ్లాస్కులో కాఫీ పోసిచ్చింది. ఆయన రాత్రి తాను అక్కడే వుంటానన్చెప్పి వెళ్ళిపోయాడు.

వకుళ వేడిగా పాలు కలిపి సారథి దగ్గరికొచ్చింది. బాబును ప్రక్కింటికి రమ తీసుకెళ్ళింది. పాలు తాగాక కొద్దిగా కుదుటప

ట్టాడు సారథి.

''...మీరిలా చెప్పాపెట్ట కుండా...చేయడం ఏమిటి? అత్తయ్యా మావయ్యా ఏమనుకుంటారసలు?''

''......''


''అన్నట్టు మీకో శుభ వార్త..మనింట్లో ఓ చిన్నారి పాపాయి రాబోతోంది తెల్సా? మధ్యాహ్నం నుంచీ మీకీ వార్త చెప్పాలని...''

ఉత్సాహంగా చెప్పుకుపోతూన్న వకుళ భర్త నుంచి ఎలాంటి స్పందనా లేకపోయేసరికి, మాటలాపి అతని ముఖంలోకి తేరిపార జూచింది.

సారథి ఎంతో మామూలుగా కళ్ళు మూసుకుని మోచేతులు కళ్ళమీదుంచుకుని పడుకున్నాడు-

''....నాకంతా తెలుసు వకుళా..డాక్టర్ నిర్మల నిన్ననే నాకు సెల్‌కి ఫోన్ చేసి చెప్పింది...ఒకటి నిజం వకుళా. మనం మనస్ఫూర్తిగా కోరితే ఏదో ఒక విధంగా మన కోరికను తీరుస్తాడు దేవుడు. పాపాయి గురించి అమ్మపడే తాపత్రయం ఆరాటం నీకు తెలుసుగా..ఆమె మొర ఇన్నేళ్ళకు విన్నాడన్నమాట దేవుడు..అమ్మకు ఇదెంతో సంతోషపడాల్సిన విషయం- అయితే అమ్మ చాలా బాధపడ్తోంది. న్యూనతగా భావిస్తోంది. అవమానంగా ఫీలై సిగ్గుపడ్తోంది. నాన్నగారూ అంతే...అమ్మ, నాన్నగారు మనకి ముఖం చూపలేక..మన నుంచి ఈ విషయాన్ని దాచి, తామేదో మహాపరాధం చేసినట్లు భావించుకుని..వాళ్ళుంతట వాళ్ళే...చాలా పెద్ద ప్రమాదకరమైన నిర్ణయానికొచ్చేశారు. అమ్మయితే చిన్నపిల్లలా అబార్షన్ చేసేయమని డాక్టర్ చేతులు పట్టుకుని మరీ బతిమాలుతూ ఏడ్చేస్తోందట...కానీ అలా చేయడం...''

''ఏవిటండీ మీరనేది? ఆరో నెలలో..అదీ ఈ వయసులో..అత్తయ్యకి జ్ఞానం లేకపోతే..సారీ..ఆ డాక్టరు మాత్రం ఎలా చేస్తుందట?- అది ఆమె ప్రాణానికే ప్రమాదం కాదూ?..మావయ్యగారికి ఆమాత్రం తెలీదూ? అబ్బ ఏవిటండీ ఇదంతాను. నాకీ విషయాలన్నీ తెలీవు. నాతో డాక్టర్ రెండు మాటలే మాట్లాడింది. 'మీ అత్తగారికి ఆరో నెల-ప్రెగ్నెన్సీ..అదీ పాప..' అనీ..'మీ అత్తగారు మీరు ట్యూబెక్టమీ-చేయించుకోవడానికి..తనంత తానుగా ఒప్పుకున్నారు' అని..అబార్షను మాటే ఎత్తలేదా విడ...ఈ విషయం తెలిస్తే నేను




అత్తయ్య నొదిలి వచ్చేదాన్నే కాదు..'' ఆందోళనపడింది వకుళ.

సారథి కళ్ళమీద నుంచి చేతుల్ని తొలగించాడు. పక్కకి తిరిగి పడుకోవాలని ప్రయత్నించాడు. సాధ్యం కాలేదు. వకుళ వైపు చూసి- 'మంచి నీళ్ళ'ని సైగ చేశాడు. వకుళ లేచి తలగడ ఎత్తుపెట్టి కూర్చోబెడంలో భర్తకు సాయం చేసి మంచినీళ్ళ తెచ్చి తాగించింది.

''వకుళా..అమ్మకిప్పుడు నలభై మూడు నిండాయి. నేను డాక్టర్ నిర్మలతో ఫోన్లో అన్నీ వివరంగా మాట్లాడాను. ఆ తర్వాత నాన్నగారినీ సంప్రదించాను. అబార్షన్ చాలా ప్రమాదం..మనకంటే ముందే ఆ మాట డాక్టర్ వాళ్ళిద్దరికీ గట్టిగా చెప్పేసింది. అయితే అమ్మానాన్నలు సిగ్గుతో మనకి ముఖం చూపలేక అలా ఆమెను బలవంతపెట్టారట. అతి చిన్న వయసులో పెళ్ళి, వెంటనే నేను పుట్టడం- ఆ తర్వాత మరిక సంతానం కలగకపోవడంతో వాళ్ళకు ఫామిలీ ప్లానింగ్ గురించి ఆలోచించాల్సిన అవసరమే రాలేదు. పూర్వం అయితే అమ్మ వయసువారికి సంతానం కలగటం వింతేమీ కాదు..కానీ ఇప్పుడలా కాదుగా..ఒకరిద్దరి తర్వాత నియంత్రణ అనివార్యం అయిపోయింది. తామూ అలాగే జాగ్రత్తపడి వుంటే..ఈరోజిలా కొడుకూ కోడలి ముందు..ఇరుగుపొరుగు ముందూ తగుదునమ్మా అంటూ మళ్ళీ సిగ్గులేకుండా పిల్లల్ని కనడం అనే దుర్గతి పట్టేది కాదని వాళ్ళిద్దరూ వాపోతున్నారు. అందుకే నీకీసారి ఆపరేషను చేయించుకోవడానికి డాక్టరు ముందు ఒప్పుకున్నారు.

నాన్నగారితో నేనన్నీ వివరంగా ఫోను మీదే మాట్లాడాను...వకుళా.. నాకు నీ సహకారం కావాలి. నువ్వు డెలివరీ అవుతూనే ఆపరేషను చేయించుకుంటే, అమ్మను చూసుకోవడం నీకు వీలుకాదని నేనీరోజిలా సాహసం చేసి వేసెక్టమీ చేయించుకొచ్చాను. వకుళా అమ్మ నిన్ను కన్నకూతురు కన్నా ప్రేమగా చూసుకుంటోంది. నువ్విప్పుడు ఆ తల్లికే తల్లివి కావాలి. ఆమె మానసికంగా బాగా కృంగిపోయింది. నువ్వామెకు ధైర్యం చెప్పాలి. ముందుగా మనం మరో కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుందాం. ఈ ఇంటిని అద్దెకిద్దాం. ఓ ఐదు సంవత్సరాలలో అంతా అదే సర్దుకుంటుంది. అమ్మని స్పెషల్‌గా ట్రీట్ చేస్తానని నిర్మలగారు మాటిచ్చారు. తన పర్యవేక్షణలో ఆమెకెలాంటి ప్రమాదం రాకుండా శాయశక్తులా ప్రయత్నిస్తానన్నారామె. బహుశా ఆపరేషన్ చేయాల్సి రావచ్చు.

ఎవరో ఏదో అంటారని అనుకుంటారేమోననీ మనం భయపడకూడదు..అమ్మ న్యూనత పోవాలంటే మనం ఈ ఇల్లు, కాలనీ వదిలెయ్యక తప్పదు. అమ్మ న్యూనతగా ఫీలవ్వాల్సిన అవసరం, అవకాశం కలగకుండా చూడాలి మనం. ఇన్నాళ్ళుగా మనం వారి పిల్లలం..ఇప్పుడు మనిద్దరం వారిద్దరికీ తల్లితండ్రీ అవ్వాలి. అప్పుడే ఈ పెద్దవాళ్ళిద్దరూ మనకు దక్కుతారు. అనునయించాల్సిన సమయంలో అనునయంగా లాలనగా చెప్దాం. మాట వినని పక్షంలో ఈ పెద్దరికపు పాత్రల్లో మన మాట వినేలా చెయ్యగలాలి. అప్పుడే వీళ్ళిద్దరూ మనకు సజీవంగా..సహజంగా మనకు దక్కుతారు. గిఫ్ట్‌గా మరో చిట్టిపాపాయి కూడా దొరుకుతుందన్నమాట-మన ఇంటి శోభను పెంచుతుందన్నమాట..మన ఇల్లిక స్వర్గసీమే అవుతుంది కదూ?? ఏమంటావ్ వకుళా? నాకు తోడుగా వుండి సహధర్మచారిణిగా సహకరిస్తావు కదూ..?''

సారథి కళ్ళనిండుగా నీళ్ళతో ఆమె రెండు చేతులూ పట్టుకున్నాడు. వకుళ కళ్ళూ నిండుగా నీళ్ళతో..ఆనందంతో..అంగీకారంగా..తళుకులీనుతున్నాయి.

